సీరియల్ (ఎనిమిదవ భాగం )

శ్రీధర



# శాంతిలేదు మనసుకు

ప్రధాన మంత్రి భార్గవకు కబురు చేశాడు.

ఆ రోజు రక్షణ మంత్రి ఆగ్రహావేశాలతో సమావేశం నుంచి వెళ్ళిపోయాక, ఆ మీటింగ్ అసంపూర్తిగా ముగిసింది. అసలు సమస్య అలాగే ఉండిపోయింది. రక్షణ మంత్రి రాజీనామా చేస్తాననటంతో సమస్య పక్కదారి పట్టింది. అంచేత ఈసారి ప్రధాన మంత్రి అటు రక్షణ మంత్రితోను, ఇటు భార్గవతోనూ విడివిడిగా చర్చలు జరుప తలపెట్టారు.

వీలైనంత త్వరలో యుద్ధం ప్రారంభించకపోతే, మన



దేశం పైన అలసత్వం ఏర్పడుతుందని, ఈసారి ఏ ప్రముఖ నాయకుడినో టార్గెట్‌గా ఎంచుకుంటారనీ, అప్పుడైనా పోరు తప్పదనీ రక్షణ మంత్రి అభిప్రాయపడ్డారు. మరికొంతమంది మంత్రులూ ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. వాళ్ళ అభిప్రాయాలను విన్నాక ప్రధాన మంత్రి భార్గవకు కబురు చేశారు. ఆయన భార్గవతో సమావేశమైనప్పుడు నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ కూడా అక్కడ ఉన్నారు.

ప్రధాన మంత్రి భార్గవను అడిగారు. "చెప్పండి భార్గవగారూ... మన సైన్యం ఏ పరిస్థితుల్లో ఉంది? మరో సారి మనం యుద్ధం చేయగలమా?"

"యుద్ధం చేయమని మీరు ఆదేశిస్తే, యుద్ధం ప్రారంభిస్తాం, ఇవాళే..." అన్నాడు భార్గవ.

"యుద్ధంలో మనం గెలవగలమా?"అని అడిగారాయన.

"గెలుపు ఓటమిలు అనేవి సైనిక బలగం మీద, వ్యూహం మీద ఆధార పడి ఉంటాయి. మన బలం మనకు ఉంటే, వాళ్ళ బలం వాళ్ళకు ఉంటుంది. వాళ్ళకు సహాయం చేసేవాళ్ళూ ఉంటారు. ఇరాక్ కువైట్‌పై దాడి చేసి ఆక్రమించుకుంటే ఏం జరిగింది? దాడికి గురైన దేశం బలహీనమైనది. యుద్ధం చేయగల సామర్థ్యం ఏ మాత్రం లేదు. అయినా ప్రపంచ దేశాలు, అగ్రరాజ్యాలూ కలిసి ఆ దేశం మీద దండెత్తినందుకు ఇరాక్ మీద యుద్ధం చేశాయి..... అంచేత బలాబలాలతో పాటు నైతిక విలువలూ ఉండాలి. ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులనూ పరిగణనలోకి తీసుకోవాలి..." అన్నాడు భార్గవ.

"మన యుద్ధ సామర్ధ్యం గురించి వివరంగా చెప్పండి..." అన్నాడు ప్రధాన మంత్రి.

మన దేశంలో కొంత మంది ఉగ్రవాదులు చొరబడి, ప్రార్థనాలయాల మీద దాడులు జరుపుతున్నారు. ఇది కళ్ళకు కనిపిస్తున్న సత్యం. ఈ కార్యకలాపాలు సాగిస్తున్నది పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ. అని మన అనుమానం. కాదు ఇవన్నీ అణచివేతకు గురి అవుతున్న కాశ్మీర్‌లోని తీవ్రవాదుల పని అని పాకిస్తాన్ అంటోంది. ఇందులోని నిజానిజాలు ఎలా ఉన్నా, ఈ దాడులు జరిపి ఉద్రిక్త వాతావరణం నెలకొల్పి యుద్ధ మేఘాలు కమ్ముకునేలా చేస్తున్నది ఉగ్రవాదులు. ప్రస్తుతం ఉగ్రవాదులు అన్ని దేశాలకూ విస్తరించారు. పేరు ఏదైనా కావచ్చు. ప్రభుత్వాలను పడగొట్టటం లేదా యుద్ధ వాతావరణం సృష్టించటం లక్ష్యంగా పెట్టుకున్న ఈ తీవ్రవాదులు మన దేశంలో ఉన్నారు, పాకిస్తాన్‌లో ఉన్నారు, నేపాల్‌లో ఉన్నారు, బంగ్లాదేశ్‌లో ఉన్నారు, శ్రీలంకలో ఉన్నారు... ఏ దేశంలో ఉన్నా, ప్రభుత్వాలను అస్థిరపరచటం, కూలగొట్టటం వీళ్ళ ధ్యేయం... వీళ్ళు సృష్టించే సంఘటనలను సాకుగా చూపి యుద్ధం ప్రారంభించటం ఎలా ఉంటుందంటే, ఇంట్లో ఎలుకలు దూరాయని ఇల్లు తగల బెట్టటం లాంటిది..." అని ఆగాడు భార్గవ.

"మరి దీనికి పరిష్కారం ఏమిటి?"

"దీనికి పరిష్కారం చాలా తేలిక. సార్క్ దేశాలన్నీ కలిసి ఉగ్రవాదులను తుడిచిపెట్టేందుకు కలిసి కట్టుగా పని చేస్తే, వాళ్ళను నామరూపాలు లేకుండా చేయుటం పెద్ద సమస్యేమీ కాదు. కానీ కలిసి కట్టుగా పనిచేయుటమే పెద్ద సమస్య.... ఇందుకు రాజకీయ కారణాలున్నాయి. కాశ్మీరులో తీవ్రవాదులు దాడులు చేస్తుండటం పాకిస్తాన్ ప్రభుత్వ మనుగడకు అవసరం. ఇక్కడ కొంత దౌత్య రాయబారం జరగాలి.... ఉమ్మడి ప్రణాళిక, ఎత్తుగడ, ముఖ్యంగా రెండు దేశాల ప్రభుత్వాల మధ్య అవగాహన కావాలి....."

"ఏ ప్రాతిపదిక మీద అవగాహన కావాలి..."

"ఏ సమస్య యుద్ధాన్ని రెచ్చగొడుతోందో, ఆ సమస్యే ప్రాతిపదిక కావాలి..."

"అంటే కాశ్మీరు సమస్యా?"

"కాదు ఉగ్రవాద సమస్య..."

"ఉగ్రవాదులను మట్టు బెట్టేందుకు పాకిస్తాన్ మనతో చేతులు కలుపుతుందా?"

రెండు శత్రుదేశాలు చేతులు కలుప లేవు.... కానీ ఇద్దరికీ కలిగే నష్టాన్ని స్పష్టంగా తెలియజేస్తే, చేతులు కలపకపోయినా, రహస్యంగా చేయూత నివ్వవచ్చు..."

"ఇది సాధ్యమా?"

"ఏదీ అసాధ్యం కాదు.... చెప్పే పద్ధతిలో చెప్పాలి... వాళ్ళ అనుమానాలు వాళ్ళకు ఉంటాయి. వాళ్ళ అంతర్గత సమస్యలు వాళ్ళకు ఉంటాయి. అందుచేత, ఈ చర్చలూ, సమేవేశాలు అతి రహస్యంగా జరగాలి...."

"ఏ స్థాయిలో జరగాలి?...."

"ముందు మా స్థాయిలో ప్రారంభిస్తాం.... ఒక అవగాహనకు వచ్చాక.... మీ స్థాయిలో రహస్య చర్చలు జరగాలి..."

"అయితే వీటికి ఎవరు చొరవ తీసుకోవాలి?..."

"మీరు అనుమతి ఇస్తే, నేను ఇవాళే పాకిస్తాన్ ఆర్మీ ఛీఫ్‌తో మాట్లాడుతాను..."

"మాట్లాడండి...." అన్నారు ప్రధాన మంత్రి.

"ఇంకొక విషయం.... ఇది యుద్ధనీతికి సంబంధించింది. మనం అజాగ్రత్తగా ఉన్నప్పుడు, ఆదమరచి ఉన్నప్పుడు ఉగ్రవాదులు మనమీద దాడి చేస్తుంటారు. మనం వాళ్ళ మీద పెద్ద ఎత్తున విరుచుకు పడేటప్పుడూ ఇదే నీతిని అమలు పరచాలి. వాళ్ళు అజాగ్రత్తగా ఉండేటట్లు, ఆదమరచి ఉండేటట్లు ఏయాలి..."

"ఎలాగా?"

"వాళ్ళ ఎత్తుగడ పారుతున్నట్లుగానే ఉండాలి... రెండు దేశాలూ యుద్ధానికి సిద్ధం కావాలి.... మీరు ఈ సంవత్సరం రక్షణ శాఖ బడ్జెట్ రెట్టింపు చేయాలి..... ఆ డబ్బంతా మన సైనిక సామర్ధ్యాన్ని పెంచేందుకు వినియోగించాలి....."

"సామర్ధ్యాన్ని పెంచేందుకు మీరేం చేయబోతున్నారు?"

"ఇందుకు నాకు కొన్ని ఆలోచనలున్నాయి. వాటిని అమలు పరచాలంటే రాజకీయ నాయకుల జోక్యం లేకుండా, నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ నాకు ఇవ్వాలి...."

"ఓ.కే.... ఇస్తున్నాను..."

"యుద్ధం వస్తే విపరీతంగా నష్టపోతాం. కార్గిల్ యుద్ధం జరిగినప్పుడు రోజుకు వెయ్యి కోట్లు ఖర్చయింది. ఇప్పటికీ ఏడు లక్షల మంది సైనికులు సరిహద్దుల్లో కాపలా కాస్తున్నారు. ఈ సారి యుద్ధం వస్తే డబ్బుతో పాటు ప్రాణ నష్టమూ భారీగా ఉంటుంది. ఈ నష్టాల్ని పూడ్చుకోవడానికి పన్నులు పెంచాలి. ఇప్పటికే పన్నుల భారాన్ని మోయలేని ప్రజల మీద మరిన్ని పన్నులు" వేయగలిగామా? దేశ జనాభాలో 86.5 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. వాళ్ళ జీవితాల్లో ఏ మాత్రం వెలుగు నింపలేని ప్రభుత్వం, వాళ్ళ ఆకలి మంటలు తీర్చలేని ప్రభుత్వం, ఎవరో ఒక ఉగ్రవాది ఒక అర్ధరాత్రి పూట ఒక బాంబు విసిరినంత మాత్రాన ఇంతమంది ప్రాణాలతో, పేదప్రజల జీవితాలతో చెలగాటం ఆడాలా? ఇన్నివేల కోట్లు ఖర్చు చేయాలా? అన్నది ప్రధానమైన ప్రశ్న. ఇప్పటికి మనం మూడుసార్లు యుద్ధం చేసి భారీ మూల్యం చెల్లించాం. యుద్ధంలో గెల్చామని మీసాలు మెలేశాం.... కానీ ఏ చొరబాట్లు ఆపటానికి యుద్ధం చేశామో, అవి ఆగిపోయాయా? పోనీ ఇంకోసారి యుద్ధం చేస్తే, రెండు దేశాల మధ్యా సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయా? సమస్యలు అలాగే కొనసాగేటట్లయితే, ఈ యుద్ధాలు చేసి ఏం సాధించినట్లు?"

"మీరు కాసేపు అలా మాట్లాడతారు... కాసేపు ఇలా మాట్లాడతారు. మా కంతా అయోమయంగా ఉంది..." అన్నాడు నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్.

"ఇందులో అయోమయం ఏమీ లేదు. వ్యూహం ప్రధానం. మన సైనిక బడ్జెట్ పెంచాలి. ఆ పెంచిన డబ్బుతో సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. అమెరికా యుద్ధ విమానాలతో, రాడార్లతో, క్షిపణులతో పోటీ పడగల ఆయుధాలు మన దేశం స్వయంగా తయారు చేసుకోవాలి. కనీసం వాటిని చూసి కాపీ కొట్టటం నేర్చుకోవాలి... ఆవిధంగా బడ్జెట్‌లో పెంచిన డబ్బుతో అధునాతనమైన ఆయుధాలను, మన ఆయుధ కర్మాగారాల్లో తయారు చేసి ఏ క్షణంలో నైనా యుద్ధానికి సిద్ధంగా ఉండాలి.... దేశ రక్షణ చాలా ముఖ్యం. అందులో రాజీపడే సమస్య లేదు. కానీ చీటికీ మాటికీ ఉగ్రవాదులు రెచ్చగొట్టినప్పుడల్లా యుద్ధాలకు దిగి ఇటు ఆయుధ సంపత్తినీ, అటు దేశ సంపత్తినీ, సైనిక బలగాలనూ ఆహుతి చేయకూడదు... ఎంతో నిగ్రహంతో వ్యవహరించాలి....

"యుద్ధాన్ని రెచ్చగొడుతున్నది ఉగ్రవాదులు. వాళ్ళను వదిలేసి పాకిస్తాన్ మీద యుద్ధం చేయటంలో అర్థంలేదు. కొంచెం జాత్య నీతిని ఉపయోగిస్తే యుద్ధం ఉగ్రవాదుల మీదనే చేసి, వాళ్ళను సమూలంగా నాశనం చేయగలం..." అన్నాడు భార్గవ.

"Is is possible?" అని అడిగాడు ప్రధాని.

"you give me free hand to deal with the situation, and I promise you, Sir, we will win the war with out shedding even a single drop of blood..."అన్నాడు భార్గవ.

"You can go ahead and I will give you a free hand...."అన్నాడాయన.

భార్గవమొహంలో ఆనందం వెల్లి విరిసింది.

❀❀❀❀❀❀❀

జ్యోతిర్మయి ఢిల్లీ వచ్చింది. ఫ్లయిట్ లేటు.

ఆమె పోర్టికోలో కారు దిగి లోపలికి వెళ్ళేటప్పటికి భార్గవ ఆఫీసుకు బయలుదేరుతున్నాడు.

"ప్రయాణం ఎలా జరిగింది డియర్..." అని అడిగాడు భార్గవ.

"బాగానే జరిగింది... మీ సంగతేమిటి? ఎలా ఉన్నారు?" అని అడిగింది.

"నిక్షేపంగా ఉన్నాను.... టిఫెను చేశాను... బయలుదేరుతున్నాను.... ఫ్లయిట్‌లో నువ్వొస్తున్నావుగదా... అంచేత అది ఇవాళ ఎలాగూ లేటుగానే వస్తుందని తెలుసు..."

"నేను గంట ముందే వచ్చి కూర్చున్నాను. నావల్ల లేటు కాదు.... ఢిల్లీలో మంచు... వాతావరణం బాగోలేదని... లేటుగా బయలుదేరింది..."

"ఓహో... నువ్వు వస్తున్నావు గదా.... వాతావరణం బావుండదులే..."

"అదిసరే గానీ మీకు ఎప్పుడూ ఎవడిమీద యుద్ధం చేద్దామా అన్న ధ్యాసే గానీ, ఇంటి గురించీ, ఇంట్లో వాళ్ళ గురించీ పట్టించుకోరు....." అన్నది జ్యోతిర్మయి.

"నేను పట్టించుకోకుండానే పిల్లల చదువులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు పూర్తయ్యాయంటావా?" అని అడిగాడు.

"ఎప్పుడో అయిపోయిన వాటి గురించి కాదు. ఇప్పుడు ఎలా ఉన్నారు, ఏం చేస్తున్నారు - అని పట్టించుకోవాల్సిన అవసరం లేదా?" అని అడిగింది జ్యోతిర్మయి.

"పసి పిల్లలుగా ఉన్నప్పుడు, తప్పటడుగులు వేస్తూ పడిపోతే, చప్పున వెళ్ళి పట్టుకుని, దెబ్బ తగిలిన చోట మందు రాస్తాం... పాతికేళ్ళు వచ్చాక క్రికెట్ ఆడుతూ గ్రౌండ్‌లో పడిపోతే, పరుగెత్తికెళ్ళి పట్టుకుని, మందు వేయాల్సిన పనిలేదు. తల్లిదండ్రులు పిల్లలతో కొంతవరకే ప్రయాణిస్తారు.... ఒకదారి చూపిస్తారు. ఆదారిలో ఎదురయ్యే ఎతు్తపల్లాలను వాళ్ళే అధిగమించాలి..." అన్నాడు భార్గవ.

"కావచ్చు. కానీ ప్రతి మనిషీ ఒక్కో సమయంలో కొన్ని ప్రలోభాలకు లోనవుతాడు. బలహీనతలకు లొంగి పోతాడు. అలాంటప్పుడే కొంత జోక్యం చేసుకుని మందలించాం...." అన్నది జ్యోతిర్మయి.

"నువ్వు నీ ఇద్దరి పిల్లల బాగోగులు మాత్రమే ఆలోచిస్తున్నావు. నాకు ఈ దేశంలోని నూరు కోట్ల మందీ పిల్లలే. ముఖ్యంగా రాత్రింబగళ్ళూ మంచుకొండల్లో చలికి ముడుచుకుని పడుకుంటున్న ఏడు లక్షలమందీ నా బిడ్డలే. వాళ్ళ సమస్యలు నాకు ముఖ్యం... ఇంట్లో పెళ్ళాం ఉన్నా, పరాయి ఆడదానికోసం పరుగులు తీసే జులాయి వెధవల గురించి ఆలోచించి టైమ్ వేస్టు చేసుకునేంత తీరిక లేదిప్పుడు.... ఇంకో ఏడాది గడిచాక రిటైర్ అయ్యాక.... అప్పుడు పట్టించుకుంటాను ఇలాంటి వెధవల గురించి...." అనేసి వెళ్ళి పోయాడు భార్గవ.

జ్యోతిర్మయి నిట్టూర్చింది. 'ఆయన మగవాడు. లోకమంతా నా ఇల్లు... ప్రజలందరూ నా పిల్లలు.... ఎక్కడేం జరిగినా నాదే బాధ్యత అంటూ పరుగులు తీస్తారు.... కానీ తనది తల్లి మనసు. తల్లి పిల్లల తర్వాతే లోకం..... పిల్లలే తన లోకం....' అనుకున్నది.

ఆమె హైదరాబాదు వెళ్ళినప్పటి జరిగిన సంగతులు గుర్తుచేసుకుంది. కొడుకులిద్దరూ జీవితంలో స్థిరపడ్డారు. రెండు చేతులా పుష్కలంగా డబ్బు సంపాదిస్తున్నారు. డబ్బు మనిషి చేత ఎన్ని పిచ్చి వేషాలు వేయిస్తుందో కూడా వాళ్ళను చూస్తే అర్థమవుతుంది.

అరవింద్ మంచి హస్తివాసిగల డాక్టర్. ఎంత పెద్ద క్లిష్టమైన ఆపరేషన్ అయినా విజయవంతంగా చేయగల డాక్టరు. సొంతంగా హాస్పటల్ పెట్టుకుని మంచి పేరు తెచ్చుకున్నాడు. అయితే డబ్బుకు పీడిస్తాడనే చెడ్డపేరు కూడా తెచ్చుకున్నాడు. స్వతాహాగా అరవింద్ డబ్బు మనిషి కాడు. కోడలు కౌముది వల్ల వాడు అలా తయారయ్యాడు. కౌముది చదువుకున్నదే అయినా స్వార్థపరురాలు. మెతుకు పోతే బతుకు పోతుందనుకునే రకం. హాస్పటల్ నిర్మాణానికి ఆమె తండ్రి డబ్బు ఇచ్చాడు కాబట్టి ఇక హాస్పటల్ మీదనే కాదు, భర్త మీదా అధికారం ఆమెదే అయింది. చివరకు సూటిపోటీ మాటలతో తనకు సన్మానం చేసిన సంఘం వాళ్ళకి డొనేషన్‌గా ఇచ్చిన రెండు లక్షలు రాబట్టుకొంది. ఇంటి రిపేర్లకు అయిన ఖర్చూ వసూలు చేసింది. తన డబ్బు ఇస్తుంటే అరవింద్ చూస్తూ ఊరుకున్నాడే గానీ, గట్టిగా వద్దని అనలేకపోయాడు. వాడ్ని నోరు లేని వాడిగా తయారు చేసింది...... మనుమరాలు ప్రకృతి .... ఈ తరం అమ్మాయిల వేషభాషలూ, ఆలోచనలూ ఎలా ఉంటాయో - ప్రకృతిని చూసి తెలుసుకోవచ్చు. పట్టు చీరలు కొని పెట్టెలో పెట్టుకుంటుంది.... జీన్స్ పాంటు, బొడ్డు కనిపించే టాప్స్ వేసుకుని తిరుగుతుంది. బొట్టు పెట్టుకునే అలవాటు లేదు. లిప్‌స్టిక్ పూయనిదే బయటకు పోదు.... బాయ్ ఫ్రెండ్‌తో అమెరికా వెళుతుందిట గానీ వాడితో ప్రేమా, పెళ్ళి, చెత్తా చెదారం లాంటి ఆలోచనలేవీ పెట్టుకోదట. తమ అవసరాలకు మనుషుల్ని ఎలా వాడుకుని వదిలేయవచ్చో - దాన్ని చూసి తెలుసుకోవచ్చు. తల్లి గుణాలన్నీ పుణికి పుచ్చుకుంది...

ఇంకో రెండో వాడు సాయినాథ్ కుటుంబం - ఆధునిక జీవితంలో వ్యక్తిగత స్వేచ్ఛ ఎలాంటి వెర్రితలలు వేస్తుందో, ఆ దంపతులను చూసి, నేర్చుకోవచ్చు. భర్త వివాహేతర సంబంధం పెట్టుకుంటే, భార్య 'నేనేం తక్కువ తిన్నానా, అంటూ తనూ బాయ్ ఫ్రెండ్స్‌తో తిరుగుతూ, అలాంటి వాళ్ళకు ఇదే సరి అయిన సమాధానం అంటూ నిర్లజ్జగా తిరిగే వాళ్ళకు దేవ సేన ఆదర్శం. భార్యా భర్తలిద్దరూ ఎవరి సుఖం వాళ్ళు చూసుకుంటే, మధ్యలో మానసికంగా కృంగి పోతున్నది -

వాళ్ళ ఏకైక సంతానం, చేతన్. తల్లిదండ్రుల ప్రవర్తనకు సిగ్గు పడి నలుగురిలో తలెత్తుకుని తిరగలేకపోతున్న ఎదిగీ ఎదగని కుర్రాడు వాడు - ఇదీ భార్గవ గారి వంశోద్ధారకుల చరిత్ర. ఇక్కడ ఈయన భారతదేశం బాగోగులు, సైనికుల యోగక్షేమాలు, అంతర్జాతీయ సరిహద్దులు, పొరుగు దేశాలతో దౌత్య నీతి, యుద్ధం వస్తే దేశానికి ఎంత నష్టం, రాకపోతే ఎంత లాభం - అంటూ అహర్నిశలూ ఆలోచిస్తూ బుర్రబద్దలు కొట్టుకుంటుంటే, అక్కడ ఈయన సుపుత్రుల లీలలు గురించి 'ఏయ్, వినరా భారత వీరకుమారా, విజయుని చరితంబూ...' అంటూ తెలిసిన వాళ్ళంతా బుర్ర కథల్లా చెప్పుకుంటున్నారు.

'నీ కుటుంబాన్ని చక్కదిద్దుకోలేని వాడివి, నీ కొడుకులను సరి అయిన మార్గంలో పెట్టలేనివాడివి, దేశాన్ని ఏం ఉద్ధరిస్తావు?' అని ఎవరైనా నిలదీసి ప్రశ్నిస్తే - సరి అయిన సమాధానం చెప్పగల ధైర్యం ఆయనకు గానీ, తనకు గానీ ఉందా?

దేశంలో ఎక్కడే అన్యాయం జరిగినా అదంతా తనకే జరిగినట్లు భావించి, ఊహించి, స్పందించి కథలు రాసింది. తన పిల్లలు చెడిపోతుంటే చూడనట్లు కళ్ళుమూసుకుని వాళ్ళకు దూరంగా ఢిల్లీలో కాలక్షేపం చేస్తోంది - 'ఇది తగునా' అని అంతరాత్మ ప్రశ్నించినట్లు అయి, గిల్టీగా ఫీలయింది - జ్యోతిర్మయి.

ఇప్పుడామెను వేధిస్తున్న మరో సమస్య - హైదరాబాద్‌లో అయిదు లక్షలు అప్పు చేసివచ్చింది. పౌరుషానికి పోయి, కోడలి మాటలకు రోషపడి అప్పు తీసుకుని డబ్బు వాళ్ళ మొహాన కొట్టింది. కోడలుకు ఇలాంటి సెన్సిటివ్ ఫీలింగ్స్ ఏమీ లేవు. డబ్బు కనిపిస్తే ఎగబడి లాక్కునే ఫీలింగ్ తప్ప వేరే ఏ ఫీలింగ్ లేదు. ఇప్పుడు ఇంక చేసిన అప్పు తీర్చటం ఎలా అన్నది సమస్య - ఆమెను వేధిస్తోంది.

భార్గవను అడిగితే ఒక క్లాస్ తీసుకుంటాడు తప్ప, అయిదు లక్షలు ఎలా పూడ్చాలా - అని ఆలోచించడు. ఆయనకు చెప్పటం అనవసరం. అరవింద్‌కు ఫోన్ చేస్తే అప్పు తీరుస్తాడు . కాని ఆ రశీదులతో సహా అన్నీ మళ్ళీ పెళ్ళానికే ఇస్తాడు. సాయిని అడిగితే వాడు తీరుస్తాడు. కానీ వాడి దగ్గర డబ్బు తీసుకున్నాక, వాడిది పై చెయ్యి, తనది కింద చెయ్యి అయిపోతుంది. గట్టిగా వాడ్ని నిలదీసి మందలించే హక్కును పోగొట్టుకుంటుంది. - ఇలా ఆలోచించుకుంటూ ఆమె మథన పడుతోంది.

ఇంత చికాకులోనూ ఆమె చేతన్‌ను గుర్తు చేసుకోకుండా ఉండలేక పోయింది. వాడికి ఫోన్ చేసింది. వాడితో మాట్లాడింది.

"ఏం చేస్తున్నావురా?" అని అడిగింది.

"రైట్ నౌవ్... హాస్టల్ ముందు, చెట్టు కింద ఉన్న కాకా హోటలు బయట చెక్క బల్ల మీద కూర్చుని కాఫీ తాగుతూ, పుస్తకం చదువుకుంటున్నాను..."

"ఏం పుస్తకంరా అది?"

"చాలా పాత పుస్తకం..."

"పర్వాలేదు పేరు చెప్పు.... లిన్ యుతాంగ్ అనే చైనా రచయిత రాసిన "ది ఇంపార్టెన్స్ ఆఫ్ లివింగ్" అనే పుస్తకం బామ్మా.... అబ్బ, ఉండరా నువ్వు..." అని కసురుకోవడం కూడా ఆమెకు వినిపించింది.

"ఒక ఫ్రెండ్.. పు, పు - అని నన్ను ఏడిపిస్తున్నాడు..." అని చెప్పాడు.

"పు, పు...నా? ... అంటే?" అని అడిగింది జ్యోతిర్మయి.

" పుస్తకాలపురుగు అయిపోయానని వెక్కిరిస్తున్నాడు..."

"ఇవన్నీ మామూలే.... కానీ ఊరికే చదివి వదిలెయ్యటం కాదు... నీకు నచ్చిన పాయింట్స్ డైరీలో రాసుకో... రోజూ రాత్రి పడుకోబోయేటప్పుడు ఆ డైరీ తిరగేసి, అందులో రాసుకున్న వాటి గురించి ఆలోచించు.... ఉంటాను... రేపు మళ్ళీ చేస్తాను... నువ్వు చదివిన విషయాలు నాకు చెప్పాలి..." అన్నది జ్యోతిర్మయి.

"అలాగే" అన్నాడు చేతన్

జ్యోతిర్మయి ఫోన్ డిస్‌కనెక్ట్ చేయగానే, మళ్ళీ 'కాల్' వచ్చింది. ఆమె రిసీవ్ చేసుకుంది.

వైస్ - అడ్మిరల్ భార్య అపర్ణాసేన్ లైన్‌లో ఉంది.

"మేడమ్, ఎలా జరిగింది మీ సన్మానం ఫంక్షన్?" అని అడిగింది.

"బాగానే జరిగింది.... మీరొస్తే బావుండేది..." అన్నది జ్యోతిర్మయి మర్యాదకోసం.

"మేం హైదరాబాదు రావటం కాదు.... ఇక్కడ ఢిల్లీలోనే మీకు గ్రాండ్‌గా సన్మానం చేయాలన్న ఆలోచనలో ఉన్నాం..." అన్నది అపర్ణ.

"వద్దు... అలాంటిదేమీ తల పెట్టకండి..." అన్నది జ్యోతిర్మయి మొహమాటపడుతూ.

"అదికాదు... మేడమ్... అన్ని రంగాల్లో పని చేసే వాళ్ళ గురించి కథలు వచ్చాయి. కానీ సైన్యంలో పని చేసే వాళ్ళ జీవితాల గురించిన కథలు చాలా తక్కువ. మిలటరీ సర్వీసులో చేరిన కొత్తలో, పెళ్ళి చేసుకున్న యువ జంట ఎలాంటి ఎడబాటు జీవితం గడుపుతారు? నగరాలకు దూరంగా విసిరేసినట్లుండే సైనిక స్థావరాల్లో ఎలాంటి అసౌకర్యాలను ఎదుర్కొంటారు? సరిహద్దుల్లో ఉండేవాళ్ళు ఎలాంటి శారీరక, మానసిక ఒత్తిడులను ఎదుర్కొంటారు? నిజంగా యుద్ధం ప్రారంభమైన తరువాత ప్రాణాలకు తెగించి ఎలా పోరాడతారు? క్షణం కిందటి వరకూ తనతో కలిసి మెలిసి తిరిగిన సహచరులు కళ్ళముందే చనిపోతే, వాళ్ళను అలా వదిలేసి పరుగులు తీస్తూ శత్రువుల మీద ఎదురు దాడికి దిగే సైనికుల మనోవేదన ఎలాంటిది? క్షతగాత్రుడిగా హాస్పటల్‌లో పడి ఉండి, ఆపదలోనైనా అయిన వాళ్ళు ఎవరూ దగ్గర లేరే – అని మధన పడే సైనికుడి అంతర్మధనం ఎలా ఉంటుంది? శత్రుసేనల చేతిలో చిక్కిన తన భర్త తిరిగొస్తాడా రాడా అని ఎదురు తెన్నులు చూసే స్త్రీ నిరీక్షణలో ఎంత వేదన ఉంది? కాళ్ళూ చేతులూ పోగొట్టుకుని బ్రతికినంత కాలం ఇతరులపై ఆధారపడే మాజీ సైనికుల భార్యలకు అందే ఆర్థిక సహాయాన్ని ఆమెకు అందకుండా చేసే కుటుంబ సభ్యుల దురాగతం ఎలాంటిది? ఇవన్నీ మీ కథల్లో ఉన్నాయి. ఈ రంగానికి చెందిన వ్యక్తుల అంతరంగ చిత్రాలను ఇంత సహజంగా, ఇంత బలంగా వ్యక్తీకరించిన రచయితలు ఎవరూ లేరు. మీరు తెలుగులో రాశారు.... ఒక్క తెలుగు వారికే కాదు... భారతదేశంలోని అన్ని భాషలవారికీ ఈ కథలు అందుబాటులోకి రావాలి... ఈ విషయం నేను నేషనల్ బుక్ ట్రస్టు వారితో మాట్లాడాను... మీకథలను పధ్నాలుగు భాషల్లోకి అనువదించి ప్రచురించే ఏర్పాటు చేస్తామన్నారు..... ఈ భాషల్లోకి అనువాదం ముద్రణ నాలుగయిదు నెలల్లో పూర్తి అవుతుంది... అప్పుడు ఆ పుస్తకాల ఆవిష్కరణ సభలో మీకు ఘనంగా సన్మానం చేయాలని అనుకుంటున్నాం... వీలైనంత త్వరలో ఈ బృహత్తర కార్యక్రమం జరిగేందుకు నేను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాను..." అని చెప్పింది అపర్ణ.

రెండు రోజుల తరువాత నేషనల్ బుక్ ట్రస్ట్ ఛైర్మన్ జ్యోతిర్మయికి ఫోన్ చేశాడు.

"మీ 'పొగమంచు' కథల సంపుటిని పధ్నాలుగు భారతీయ భాషల్లోకి అనువదించి ముద్రించేందుకు మా కమిటీ నిన్నటి సమావేశంలో నిర్ణయించింది. అగ్రిమెంటుకు సంబంధించిన కాగితాలు పోస్టులో పంపిస్తున్నాను.... మీరు సంతకం చేసి పంపగానే రెమ్యునిరేషన్ కింద ఏడు లక్షల రూపాయలకు చెక్కు పంపిస్తాం...." అన్నాడాయన.

ఆమె అగ్రిమెంటు మీద సంతకం చేసి పంపిన వారం రోజుల తరువాత నేషనల్ బుక్ ట్రస్ట్ ఛైర్మన్ భట్టాచార్య స్వయంగా వచ్చాడు.

"ఇన్నేళ్ళు జీవితంలో నేను ఎన్నో పుస్తకాలు చదివాను. కానీ వీర సైనికుల జీవితాల్లో ఎంత దుర్భర వేదన ఉందో మీ కథలు చదివి తెలుసుకున్నాను....ప్రతి కథా గుండెల్ని పిండేసింది. కన్నీళ్ళు తెప్పించింది. నాకు తెలుగు రాదు.... అనువాదమే ఇంత బలంగా ఉంటే, మాతృక మరెంతగా కదిలిస్తుందో అర్థం చేసుకోగలను... మీలాంటి రచయిత్రిని చూడాలన్న కోరికతో స్వయంగా వచ్చాను..." అన్నాడు భట్టాచార్య ఆమెకు చెక్కు అందిస్తూ.

ఆయన వెళ్ళి పోయ్యాక చెక్కు వంక చూస్తూ 'ఒక సమస్య పరిష్కారం అయింది' అనుకుంది. మర్నాడే ఆంధ్రా బ్యాంక్‌లో తీసుకున్న అయిదు లక్షల అప్పు తీర్చేందుకు చెక్ పంపించింది.

******

(తరువాయి వచ్చే సంచికలో